సిన్నెర్ సూపర్

ఆస్ట్రేలియా ఓపెన్

పురుషుల సింగిల్స్ టైటిల్ కైవసం • ఫైనల్లో మెద్వెదెవ్‌పై ఘనవిజయం

ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్‌కు సెమీస్‌లో షాకిచ్చిన ఇటలీ యువ కెరటం సిన్నెర్.. అదే జోష్‌లో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. హోరాహోరీగా సాగిన తుదిపోరులో మెద్వెదెవ్‌ను మట్టికరిపిస్తూ.. తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన పోరులో తొలి రెండు సెట్‌లు కోల్పోయిన తర్వాత కూడా పట్టు వదలకుండా ప్రయత్నించిన సిన్నెర్ విజయనాదం చేశాడు.

మెల్‌బోర్న్: సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో నయా చాంపియన్ అవతరించాడు. దశాబ్ద కాలంగా బిగ్‌త్రి (ఫెదరర్, నాదల్, జొకోవిచ్) చేతుల్లోనే తిరిగిన ట్రోఫీని ఈ సారి ఇటలీకి చెందిన 22 ఏండ్ల కుర్రాడు జానిక్ సిన్నెర్ హస్తగతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నెర్ 3-6, 3-6, 6-4, 6-4, 6-3తో మూడో సీడ్ మెద్వెదెవ్‌పై విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో ఐదో సీడ్ రుబ్లెవ్‌పై గెలిచిన సిన్నెర్ సెమీస్‌లో వరల్డ్ నంబర్‌వన్ జొకోవిచ్‌కు షాకిచ్చిన విషయం తెలిసిందే. 3 గంటల 44 నిమిషాల పాటు సాగిన తుదిపోరులో తొలి రెండు సెట్‌లు కోల్పోయిన తర్వాత సిన్నెర్ అద్భుతంగా పుంజుకోగా.. ఆరోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన మెద్వెదెవ్ ఐదోసారి రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నాడు. ఇందులో తొలి రెండు సెట్‌లు గెలిచిన తర్వాత ప్రత్యర్థికి వరుసగా మూడు సెట్‌లు కోల్పోవడం మూడోసారి. మెల్‌బోర్న్ సెంటర్ కోర్ట్‌లో జరిగిన ఫైనల్లో సిన్నెర్ 14 ఏస్‌లు కొట్టి 5 డబుల్ ఫాల్ట్స్ చేస్తే.. మెద్వెదెవ్ 11 ఏస్‌లు బాది 57 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు. సిన్నెర్ 50 విన్నర్లు సంధించగా.. మెద్వెదెవ్ 44 విన్నర్లు కొట్టి 4 బ్రేక్ పాయింట్లు సాధించాడు. తద్వారా ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ నెగ్గిన తొలి ఇటలీ ప్లేయర్‌గా సిన్నెర్ రికార్డుల్లోకి ఎక్కగా.. 2008లో తొలిసారి జొకోవిచ్ ఆస్ట్రేలియా టైటిల్ గెలిచిన తర్వాత విజేతగా నిలిచిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. 'ఇది చాల పెద్ద టోర్నీ. ఇందులో విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఈ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నా. నాకింకా 22 ఏండ్లే. మున్ముందు కూడా ఇలాంటి ప్రదర్శనలు పునరావృతం చేయాలనుకుంటున్నా' అని మ్యాచ్ అనంతరం సిన్నెర్ పేర్కొన్నాడు. టైటిల్‌తో పాటు సిన్నెర్‌కు 17.22 కోట్ల ప్రైజ్‌మనీ లభించింది.

వ్రితికి మరో స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ స్విమ్మర్లు సత్తా చాటుతున్నారు. చెన్నై వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో ఇప్పటికే రెండు స్వర్ణాలు నెగ్గిన యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ మూడో పసిడి పతకం ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి 4 నిమిషాల 32.77 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. మీనాక్షి (4ని. 37.60 సె.; కర్ణాటక), అదితి (4ని.39.58 సె.; మహారాష్ట్ర) వరుసగా రజత కాంస్యాలు గెలుచుకున్నారు. మరోవైపు మహిళల 100 మీటర్ల బెస్ట్‌స్ట్రోక్‌లో తెలంగాణకు చెందిన శ్రీనిత్య సాగి కాంస్య పతకం కైవసం చేసుకుంది.

అర్షిన్ (108)

యువ భారత్ హ్యాట్రిక్

బ్లూమ్‌ఫాంటైన్: అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత క్రికెట్ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. ఇప్పటికే సూపర్ సిక్స్‌కు అర్హత సాధించిన యంగ్‌ఇండియా.. ఆదివారం 201 పరుగుల తేడాతో అమెరికాను చిత్తుచేసింది. మొదట యువ భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (108; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) శతక్కొట్టగా.. ముషీర్ ఖాన్ (73) రాణించాడు. అనంతరం అమెరికా 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 125 పరుగులకే పరిమితమైంది. మన బౌలర్లలో నమన్ తివారీ 4 వికెట్లు పడగొట్టాడు. అర్షిన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

షామార్ జోసెఫ్ (7/68)

విండీస్ సంచలనం

గబ్బాలో ఆస్ట్రేలియాపై విజయం

బ్రిస్బేన్: వెస్టిండీస్ క్రికెట్ జట్టు సంచలనం సృష్టించింది. 27 ఏండ్ల తర్వాత ఆసీస్ గడ్డపై అదీ గబ్బాలో టెస్టు మ్యాచ్ నెగ్గింది. విండీస్ యువ పేసర్ షామార్ జోసెఫ్ (7/68) నిప్పులు చెరగడంతో ఆసీస్ 8 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 216 పరుగుల లక్ష్యఛేదనలో కంగారూలు 207 రన్స్ చేసి ఆలౌటయ్యారు. స్మిత్ (91 నాటౌట్) ఒంటరి పోరాటం వృథా అయింది. బ్యాటింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడి కూడా జోసెఫ్ అద్భుత బౌలింగ్‌తో కరీబియన్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులు చేయగా.. అతివిశ్వాసానికి పోయిన ఆస్ట్రేలియా 289/9 వద్ద మొదటి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 193 పరుగులు చేసి కంగారూల ముందు మంచి లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. పింక్ బాల్ టెస్టులో ఆసీస్‌కు ఇదే తొలి ఓటమి కాగా.. సిరీస్ 1-1తో సమమైంది. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరించిన విండీస్ దిగ్గజం బ్రియాన్ లారా విండీస్ విజయంతో ఆనంద భాష్పాలు రాల్చాడు.

భంగపాటు!

తొలి టెస్టులో భారత్ పరాజయం • 28 పరుగులతో ఇంగ్లండ్ గెలుపు

విజృంభించిన ఓలీపోప్ • తిప్పేసిన హార్ట్లీ

తొలి రెండు రోజులు కనీసం పోటీలో కూడా లేని ఇంగ్లండ్.. అద్వితీయ పోరాటంతో అద్భుత విజయం సాధిస్తే.. ఆరంభంలో పూర్తి ఆధిపత్యం కనబర్చిన టీమ్‌ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో ప్రభావం చూపలేకపోయింది.

ఉత్కంఠ భరితంగా సాగిన ఉప్పల్ టెస్టులో బ్యాట్‌తో ఓలీ పోప్ గుర్తుంచుకోదగ్గ ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. బంతితో హార్ట్లీ బెంబేలెత్తించాడు. స్పిన్ బాగా ఆడుతారనే పేరున్న భారత ఆటగాళ్లు.. ఓ అరంగేట్ర స్పిన్నర్‌కు ఏడు వికెట్లు సమర్పించుకోవడం గమనార్హం!

వెస్టిండీస్‌తో రెండో టెస్టులో 216 పరుగుల లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 8 పరుగుల దూరంలో నిలిచిపోతే.. ఇంగ్లండ్ నిర్దేశించిన 231 పరుగుల చేజింగ్‌లో టీమ్‌ఇండియా 28 పరుగులతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ ఆరంభంలో ఆతిథ్య జట్లే రాణించినా.. టాపార్డర్ వైఫల్యాలతో పరాజయం పాలవడం కొసమెరుపు!!

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇంగ్లండ్ అద్భుతం చేసింది. ఆశలే లేని స్థితి నుంచి గొప్పగా పోరాడిన ఇంగ్లిష్ జట్టు.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో బోణీ కొట్టింది. బ్యాటర్ల పట్టుదలకు బౌలర్ల సహకారం తోడవడంతో ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగిన మొదటి టెస్టులో ఇంగ్లండ్ 28 పరుగుల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. ఒక దశలో ఇంగ్లండ్ ఓటమి ఖాయమనుకుంటే.. చివరి రెండు రోజులు వీరోచితంగా పోరాడిన పర్యాటక జట్టు కొండంత ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. సొంతగడ్డపై అదరగొడతారు అనుకున్న మన స్పిన్నర్లు తేలిపోగా.. ఇంగ్లండ్ తరఫున తొలి టెస్టు ఆడిన లెఫ్టార్మ్ స్పిన్నర్ హార్ట్లీ ఏడు వికెట్లతో టీమ్‌ఇండియా పతనాన్ని శాసించాడు. 231 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 202కే ఆలౌటైంది. రోహిత్ (39; 7 ఫోర్లు) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 316/6తో ఆదివారం నాలుగో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్.. చివరకు 420 పరుగులకు ఆలౌటైంది. పోప్ (196; 21 ఫోర్లు) చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. రేహాన్ (28), హార్ట్లీ (34) అతడికి చక్కటి సహకారం అందించారు. చివరి నాలుగు వికెట్లు తీసేందుకు భారత్ తీవ్రంగా ఇబ్బంది పడింది. శనివారం లోయర్‌ఆర్డర్‌తో కలిసి ఫోక్స్ 104 పరుగులు జోడించడంతో భారత్ ముందు 231 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మన బౌలర్లలో బుమ్రా 4, అశ్విన్ 3 వికెట్లు పడగొట్టారు.

టాపార్డర్ వైఫల్యం

ఒకటి నుంచి తొమ్మిదో స్థానం వరకు బ్యాటింగ్ చేయగల సమర్థులున్న భారత జట్టు ముందు 231 లక్ష్యం పెద్దది కాదనిపించింది. అందుకు తగ్గట్లే కెప్టెన్ రోహిత్ శర్మ ధాటిగా ఆడటంతో పని సులువే అనిపించింది. అయితే హార్ట్లీ రంగ ప్రవేశంతో పరిస్థితి మారిపోయింది. యశస్వి (15)తో ప్రారంభమైన వికెట్ల పతనం ఇక ఏ దశలోనూ ఆగలేదు. శుభ్‌మన్ గిల్ (0) మరోసారి నిరాశ పరుస్తూ ఎదుర్కొన్న రెండో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్ (22), అక్షర్ పటేల్ (17), శ్రేయస్ అయ్యర్ (13), రవీంద్ర జడేజా (2) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా 119/7తో భారత్ పరాజయం ఖాయం కాగా.. చివర్లో శ్రీకర్ భరత్ (28), అశ్విన్ (28) కాస్త ఆశలు రేపినా.. ఈ ఇద్దరి వికెట్లు పడగొట్టిన హార్ట్లీ టీమ్‌ఇండియాను మరోసారి దెబ్బకొట్టాడు. అశ్విన్, జడేజా, అక్షర్‌ను ప్రత్యర్థి బ్యాటర్లు రివర్స్ స్వీప్ ఆయుధంతో దెబ్బకొడితే.. మన వాళ్లు ఛేదనలో కనీస పోరాటం కనబర్చలేకపోయారు.

పోప్ (196)

1 భారత్‌లో అత్యధిక (15) టెస్టు విజయాలు నమోదు చేసిన జట్టుగా ఇంగ్లండ్ నిలిచింది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ 14 మ్యాచ్‌లు నెగ్గాయి.

1 హైదరాబాద్‌లో (ఎల్బీ, ఉప్పల్ మైదానాల్లో కలిపి) భారత జట్టు టెస్టు మ్యాచ్ ఓడిపోవడం ఇదే తొలిసారి.

1 తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగుల వెనుకబడి ఉండి భారత్‌లో ఓ విదేశీ జట్టు టెస్టు మ్యాచ్ గెలవడం ఇదే తొలిసారి. 1964లో ఆస్ట్రేలియా 65 పరుగుల వెనుకబడి ఉండి ఆ తర్వాత మ్యాచ్ నెగ్గింది.

హార్ట్లీ (7/62)

సంక్షిప్త స్కోర్లు
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 436; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 420 (పోప్ 196, డకెట్ 47; బుమ్రా 4/41, అశ్విన్ 3/126); భారత్ రెండో ఇన్నింగ్స్: 202 (రోహిత్ 39; భరత్ 28; హార్ట్లీ 7/62).

రాజడి

మార్కెట్ బౌన్స్‌కు చాన్స్

మార్కెట్ పల్స్

గత కాలమ్‌లో సూచించినట్టే జనవరి 25తో ముగిసిన 3 రోజుల ట్రేడింగ్ వారంలో మార్కెట్ తీవ్ర ఒడిదొడుకులకు లోనైంది. తొలుత 21,716 పాయింట్ల గరిష్ఠస్థాయికి పెరిగిన ఎన్ఎస్ఈ నిఫ్టీ వెనువెంటనే 21,137 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. తిరిగి కొంతవరకూ కోలుకున్నప్పటికీ, వారం మొత్తంమీద 219 పాయింట్లు క్షీణించి 21,353 పాయింట్ల వద్ద క్లోజైంది. జనవరి 31న ఫెడ్ రిజర్వ్ పాలసీ, ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ అంశాలు ట్రెండ్‌ను ప్రభావితం చేస్తాయని విశ్లేషకులు తెలిపారు. ముఖ్యంగా ఫెడ్ చైర్మన్ సంకేతాలు కీలకమని చెప్పారు. సాంకేతికంగా చూస్తే క్రితం వారం పతన సమయంలో వరుసగా 2, 3 రోజులు 21,000 పాయింట్లకు కాస్త ఎగువన ఉన్న 50 డీఎంఏ రేఖ నిఫ్టీ క్షీణతను అడ్డుకోవడం, బ్యాంక్ నిఫ్టీ 200 డీఎంఏ ఎగువన ముగియడం సానుకూల అంశమైని, దీంతో ఈ వారం పూర్తిగా టర్న్ ఎరౌండ్ కాకపోయినా, కొంతమేర బౌన్స్ అవుతుందని మార్కెట్ విశ్లేషకుడు కునాల్ బోత్రా అంచనా వేశారు. 50 డీఎంఏను నిఫ్టీ నిలుపుకున్నందున ఈ వారం కొద్ది పాటి రికవరీ ఉంటుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీస్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ ఆనంద్ జేమ్స్ విశ్లేషించారు.

మధ్దతు 21,000

ఈ వారం నిఫ్టీకి 21,000 పాయింట్ల వద్ద లభిస్తున్న మద్దతుస్థాయి కీలకమైనదని, ఈ స్థాయిని కోల్పోతే మరింత బలహీనపడుతుందని కునాల్ బోత్రా తెలిపారు. 21,500-21,560 స్థాయివరకూ నిఫ్టీ బౌన్స్ కావచ్చని, ట్రెండ్ పూర్తిగా బుల్లిష్‌గా మారాలంటే 21,800 పాయింట్ల స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని ఆనంద్ జేమ్స్ వివరించారు. స్వల్పకాలిక పొజిషన్లకు 20,900 పాయింట్ల స్థాయిని స్టాప్‌లాస్‌గా నిర్దేశించుకోవచ్చని ఇన్వెస్టర్లకు సూచించారు.

దీర్ఘకాలిక సేవింగ్స్‌కు ఇల్లే కొనాలా!

అతని పేరు ఆశిష్. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఇంకా పెండ్లి కాలేదు. హైదరాబాద్‌లో తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) వంటి ఉద్యోగుల కుండే తప్పనిసరి వార్షిక పొదుపులు మినహా పెద్దగా ఎటువంటి ఆర్థిక ప్రణాళికలూ లేని వ్యక్తి. ఖర్చులు విపరీతం. ముఖ్యంగా క్రెడిట్ కార్డులపై బోలెడు బకాయిలున్నాయి. ఇదంతా చూసిన ఆశిష్ తల్లిదండ్రులది.. ఓ ఇల్లు కొనుక్కున్నా అనవసరపు ఖర్చులు తగ్గి కొడుకు దారిలో పడుతాడన్న ఆలోచన. ఆశిష్ సైతం ఇదే యోచనలో ఉన్నాడు. ఇంటి కొనుగోలు వంటి దీర్ఘకాలిక పెట్టుబడికి ఇదే సరైన సమయం అన్నది అతని అభిప్రాయం. ఆశిష్, తన తల్లిదండ్రుల తరహాలోనే ఇప్పుడు చాలా మందిది ఇదే ఆలోచన. అయితే దీర్ఘకాలిక సేవింగ్స్ కోసం ఇల్లే కొనాలా? అన్నది ఇక్కడి ప్రశ్న. దీనిపై నిపుణుల మాటకొస్తే..

అవసరమైతేనే..

అవసరమైతే తప్ప ఇలాంటి భారీ ఫైనాన్షియల్ కమిట్‌మెంట్‌కు వెళ్లవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఇల్లు కొనుగోలు అనేది పెట్టుబడి వైపు నుంచి చూడకూడదని సలహా ఇస్తున్నారు. ఆదాయం సరిపడాలేని ఇటువంటి సమయంలో తొందరపాటు నిర్ణయాలు మరిన్ని ఇబ్బందులకు దారితీస్తాయని అంటున్నారు. కాబట్టి ఎవరైనాసరే తమ అవసరాలను ముందుగా తెలుసుకుని ఓ నిర్ణయానికి వస్తే బాగుంటుందని చెప్తున్నారు. పొదుపుపై ఆలోచనలు లేకుండా, ఖర్చులపై నియంత్రణ లేనివారికి భారీ లక్ష్యాన్ని అప్పజెప్పడం ఎన్నో అనర్థాలకు దారితీస్తుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు. క్రెడిట్ స్కోర్ సరిగా లేకున్నా బలవంతంగా అధిక వడ్డీలపై రుణాలు తీసుకుని, ఇల్లు కొంటే తీవ్రమైన ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొంటున్నారు. ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకుని, కొంత నగదును సమకూర్చుకుని ముందుకెళ్తే విజయం సొంతమవుతుందని హితవు పలుకుతున్నారు.

కొత్త పన్నులో ఊరట

మధ్యంతర బడ్జెట్‌కు వేళైంది. పన్ను కోతలు, వడ్డనలపై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి.

ఎప్పట్లాగే ఈ పద్దుపైనా సామాన్యులు.. ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు, అందులోనూ వేతన జీవులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

అయితే ఇది ఓట్ అన్ అకౌంట్ బడ్జెట్ కావడంతో ప్రభుత్వం ఏ మేరకు తమ అంచనాల్ని అందుకుంటుందన్న అనుమానాలూ ఉన్నాయి. అసలు బడ్జెట్‌పైనున్న ఎక్స్‌పెక్టేషన్స్ ఏమిటి?

లోక్ సభ ఎన్నికలకు ముందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 1న ప్రకటించే ఈ బడ్జెట్.. మధ్యంతర బడ్జెట్. దీంతో సాధారణంగా ఎటువంటి పెద్ద పన్ను సవరణలు ఉండకపోవచ్చనే అంటున్నారంతా. అయినప్పటికీ కొన్ని పన్ను మినహాయింపులను వ్యక్తిగత ట్యాక్స్‌పేయర్స్ ఆశిస్తున్నారు. ప్రభుత్వం సైతం ఆ దిశగా అడుగులు వేయవచ్చన్న అంచనాలున్నాయి. అవి..

సవరణలకు అవకాశాలు

మరింత మంది ట్యాక్స్‌పేయర్లు కొత్త పన్ను విధానాన్ని ఎంచుకొనేలా.. ఇందులో ప్రోత్సాహకాల్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావచ్చన్న అంచనాలు గట్టిగా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే పన్ను శ్లాబ్స్‌ను మార్చే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అలాగే పన్ను మినహాయింపునకున్న కనీస పరిమితిని ప్రస్తుతమున్న రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచితే మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు ఊరటేనని చెప్పుకోవచ్చు. అంతేగాక మొత్తం పన్ను మినహాయింపు పరిమితిని ఇప్పుడున్న రూ.7 లక్షల నుంచి 8 లక్షలకు పెంచవచ్చన్న అంచనాలూ నెలకొన్నాయి. ఇక పాత పన్ను విధానంలో వివిధ రకాల కోతలు/మినహాయింపులకు వీలున్నది. దీనివల్ల పొదుపు, ఇతరత్రా బీమా, పెన్షన్ పథకాలకు ప్రాధాన్యతనిచ్చేవారు. అయితే కొత్త పన్ను విధానంలో ఏ ట్యాక్స్ డిడక్షన్స్/ఎగ్జెంప్షన్స్ లేవు. దీంతో శ్లాబులు/రేట్లను హేతుబద్ధం చేయడంతో పాటు పొదుపు, ఆరోగ్య సంరక్షణ, రిటైర్మెంట్ వంటి వాటికి ప్రోత్సాహకాలను ట్యాక్స్ పేయర్స్ ఆశిస్తున్నారు. ఎన్నికల వేళ దీనిపైనా కేంద్రం దృష్టి పెట్టి ఉంటుందన్న ఊహాగానాలున్నాయి. ఇక ఉద్యోగుల కోసం స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ.50,000 నుంచి లక్ష రూపాయలకు పెంచవచ్చన్న అంచనాలున్నాయి.

టీడీఎస్ విధానంపై..

ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్) కోతల కోసం ప్రస్తుతం ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లో 30కిపైగా సెక్షన్లున్నాయి. ఇవన్నీ కూడా 0.1 శాతం నుంచి 30 శాతం శ్రేణిలో రకరకాల శ్లాబులు, రేట్లతో ఉన్నాయి. ఇదంతా సంక్లిష్టంగా తయారైంది. పన్ను సంబంధిత వివాదాలకూ దారితీస్తున్నది. ఇటీవల ఆయా సెక్షన్ల వర్గీకరణ, వివరణలపై పరిశ్రమ వర్గాలు సైతం అనేక ఆందోళనల్ని వెలిబుచ్చాయి. దీంతో రాబోయే బడ్జెట్‌లో వీటన్నిటికీ స్పష్టత లభించేలా మార్పులు ఉండవచ్చన్న అంచనాలున్నాయి. ఇందుకోసం సవరణలుంటాయని అంటున్నారు.

ఐటీఆర్ ఫైలింగ్స్‌పై..

ఆలస్యమైన, సవరించిన ట్యాక్స్ రిటర్నుల దాఖలు కోసం ఉన్న గడువులను ఆర్థిక చట్టం 2021తో సవరించారు. అయితే విదేశీ ఆదాయం సైతం భారత్‌లో పన్నులకు లోబడే ఉంటుంది కాబట్టి ఆ ఆదాయమున్న వ్యక్తిగత ట్యాక్స్‌పేయర్ల కోసం ట్యాక్స్ రిటర్నుల సవరణలు, వాటి దాఖలుకుండే గడువుల విషయంలో వస్తున్న ఇబ్బందుల్ని తొలగించాలన్న డిమాండ్లున్నాయి. వీటికి ఈ బడ్జెట్‌లో ఓ పరిష్కారం దొరకవచ్చన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది.

ఈవీ లోన్ల కోసం..

విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) కొనుగోళ్ల కోసం పెట్టుకున్న రుణాలు 2019 జనవరి 1 నుంచి 2023 మార్చి 31 మధ్య ఆమోదం పొందితే సదరు లోన్‌పై వాహనదారులు చెల్లించే వడ్డీలో షరతులకు లోబడి రూ.1,50,000 రాయితీ పొందవచ్చు. అయితే పర్యావరణ హితం కోసం ఈ అవకాశాన్ని వచ్చే బడ్జెట్‌లో పొడిగిస్తారన్న అంచనాలున్నాయి. అలాగే సెక్యూరిటీలు, ఇతరత్రా మూలధన ఆస్తుల అమ్మకంపై వర్తించే రకరకాల పన్ను రేట్లను సమన్వయం చేయడం ద్వారా క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సరళతరం చేసే వీలుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం ఆదాయ పన్ను శ్లాబు రేట్లు

పాత పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	60 ఏండ్లలోపు	60-80 ఏండ్లు	80 ఏండ్లు పైబడినవారు
2.50 లక్షల వరకు	లేదు	లేదు	లేదు
2,50,001-3,00,000	5%	లేదు	లేదు
3,00,001-5,00,000	5%	5%	లేదు
5,00,001-10,00,000	20%	20%	20%
10 లక్షలపైన	30%	30%	30%

కొత్త పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	ఆదాయ పన్ను రేట్లు
3 లక్షల వరకు	లేదు
3,00,001-6,00,000	5% (సెక్షన్ 87ఎ కింద ట్యాక్స్ రిబేటు)
6,00,001-9,00,000	10% (సెక్షన్ 87ఎ కింద రూ. 7 లక్షల వరకు ట్యాక్స్ రిబేటు)
9,00,001-12,00,000	15%
12,00,001-15,00,000	20%
15 లక్షలపైన	30%

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.